# నక్షత్ర లోయ

కథ

రమణజీవి

ఆ రాత్రి నా డ్యూటీ గాంధీ హాస్పిటల్ నించి ఓ హతుడి 'విసిరా'ను (ఉదరమూ, రొమ్ము లోపలి అవయవాలు) ప్యాక్ చేసిన పెట్టెను రీజనల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీకి చేర్చడం.

చచ్చినవాడు ఏదో రాజకీయ పార్టీకి చెందినవాడు! లేకపోతే ఇంత రాత్రిపూట కొంపలు మునిగినట్లు ఈ డ్యూటీ వుండదు. చలికి లోపల్నించి వొణుకొస్తోంది. హిస్పటల్ నించి బయట పడ్డాను. లోపల ప్యాకింగ్ సరిగ్గా చేసినట్టు లేదు. లీకయి ఒకటే దుర్వాసన! తల తిరిగిపోయింది! ఇంత దుర్భరంగా వుంటుందా విసిరా? గబగబా అప్పుడే ఆగిన సిటీబస్ ఎక్కేను. బస్ కదలక ముందే ప్రయాణీకులంతా ముక్కులు మూసుకున్నారు. కండక్టర్ నేను దిగిందాకా వూరుకోలేదు.

కరెంట్ కూడా లేదు. చీకట్లో... చురకత్తిలా కోస్తున్న చలిలో... ఎవరివో అవయవాల్ని మోసుకుంటూ... భరించలేని వాసనతో... ఒక్కణ్ణీ నించున్నాను.

లాబ్ ఎంత లేదన్నా ఓ మూడు కిలోమీటర్లుంటుంది.

ఆటోలో ఎక్కడానికీ లేదు. ఆటో డ్రైవరూ వూరుకోడు. ఒకవేళ వొప్పుకున్నా చాలానే డిమాండ్ చేస్తాడు. స్వంత వెహికల్ తీసుకోడానికి ఎలాంటి సదుపాయమూ లేదు ఈ హోంగార్డ్ వుద్యోగంలో. అసలు జీతమే అంతంత మాత్రం. అలవెన్స్‌ల గురించి చెపితే ఎవరైనా నవ్వుతారు. నెలకు నాలుగుసార్లు పెరేడ్‌కు హాజరు కావడానికి వాళ్లిచ్చే అలవెన్స్ పధ్నాలుగు రూపాయలంటే నమ్ముతారా? అసలు ఈ సిటీలో బస్ ఛార్జీలకన్నా సరిపోతుందా ఆ సొమ్ము. మరి యూనిఫార్మ్ గంజిపెట్టి ఇస్త్రీ చేసుకోడానికి? బూట్లు పాలిష్ చేసుకోడానికీ? అదేమంటే ఇది మీరు వాలంటీర్‌గా ఎంచుకున్న వుద్యోగం మీ ఇష్టం ఇంటారు పైవాళ్లు. స్వచ్ఛందమేనా నిజంగా? కాదు. గతిలేక! విధిలేక!

చిన్నప్పట్నించీ ఎన్ని కష్టాలు పడినా నేనెందుకో ఎవర్నీ నిందించలేకపోయాను. అందరూ ఏదో రకంగా తమ ఇష్టాలకు అనుగుణంగా బతకలేకపోవడాన్నీ అసలు తమ ఇష్టాలేంటో తెలియకపోవడాన్నీ చూశాను. అయినా తమ చేష్టల మీద తమకే అధికారం లేనివాళ్లను ఎలా నిందించగలను?

కేవలం తన వొక్కడి కోసమే బతికి అందులో భాగంగానే ఓ హత్య కూడా చేసి మమ్మల్ని గాలికి వొదిలేసి జైలుకెళ్లిన మా నాన్న మీద కూడా ఎప్పుడూ కోపం రాలేదు. బహుశా ఇది నా మానసిక మాంద్యమేమో!

అప్పటికే పెట్టె చుట్టూ శబ్దం చేస్తూ ఈగలు ముసురుకుంటున్నాయి. తలెత్తి పైకి చూశాను. బక్కచిక్కిన చంద్రుణ్ని ఓ మూలకు నెట్టేసి ఆకాశం నిండా ముసురుకున్న చుక్కలు.

ఓ కుక్క ఒకటే మొరుగుతోంది నన్ను చూసో లేక విసిరా వాసనకో. ఆ నిమిషం ఈదురుగాలులతో హోరెత్తిపోతున్న ఈ భూగోళం మీద నేను, ఈ కుక్క, మాత్రమే జీవించి వున్నట్టనిపిస్తోంది.

అందరూ తిరస్కరించిన ఈ వాసన్ని నేనెందుకు భరించాలి? కేవలం నాలుగు జీతం రాళ్లకోసమా? పెట్టెకు కొంచెం దూరంగా జరిగి నించున్నాను తట్టుకోలేక.

మామూలుగా ఈ పరిస్థితి ఎప్పుడూ రాదు. కేవలం హాస్పిటల్‌లో విసిరాను సరిగా ప్యాక్ చెయ్యనివాడి తప్పు ఇది. కానీ దాని ఫలితమంతా నా ఒక్కడి మీదే పడింది.

ఏం చెయ్యాలి. అంత దూరం మోసుకుంటూ పోవాల్సిందేనా? ఓసారి చుట్టూ చూశాను. కొంచెం దూరంలో చెట్టు కింద ఓ కుటుంబం మసక మసగ్గా.

"ఇదో బాబూ! నీ బండి ఓసారి ఇస్తావా! ఒక గంటలో మళ్లీ తెచ్చిస్తా".

నా యూనిఫార్మ్‌కేసి భయంగా చూస్తున్నాడు ఆ కుష్టువాడు. ప్రశ్నించడానిక్కూడా నోరు వస్తున్నట్టు లేదు. ఆడమనిషి కూడా నోరు తెరుచుకుని నా వేపే చూస్తోంది పిల్లని ఒడిసి పట్టుకుని.


నేనే చెప్పాను నా సమస్యను వివరంగా.

అతనసుకున్నట్టు నా గొంతులో పోలీసు లేకపోవడం అతడికి చాలా వుపశమనంగా అనిపించినట్టుంది.

గబగబా లేచి నిలబడుతూ "తీస్కో సార్. తీస్కో. ఏయ్ అయ్యన్నీ తీసేసి బండీయే సారుకు" అన్నాడు.

బాక్స్‌ను ఆ నాలుగు చక్రాల బండికి కలిపి గట్టిగా తాడుతో కట్టి ఈడ్చుకెళ్లడం ప్రారంభించాను. దుమ్ము రేపుతూ ఈదురుగాలి వీస్తోంది. ఏవేవో చిత్తు కాగితాలూ, పాలితిన్ కవర్లు నా మీద ఎదురు దాడి చేస్తున్నాయి గుండ్రంగా తిరుగుతూ. దుమ్ము పడకుండా కళ్లని చికిలిస్తూ గాలికి ఎదురీదుతున్నాను. ఆ చీకట్లో ఒక నీడలా సాగిపోతున్న నాకు మరొక నీడలా ఈ విసిరా! వెంటాడుతున్న మానవ దుర్వాసన! నాకు మొత్తం మానవజాతి మీదే విరక్తి కలిగిందా క్షణం.

మానవుల సౌందర్యం మీద, కాడ్రాయ్ దుస్తుల మీద, పోషించబడిన చర్మాల మీదా, మానవుల శాస్త్రాల మీదా, జ్ఞానాల మీదా, ఆకాశ హర్మ్యాల మీదా ఒకటనేమిటి మానవుడి స్పర్శ సోకిన ప్రతీదాని



మీదా విరక్తి కలిగింది. బహుశా ఈ దెబ్బతో ఏ మనిషి సామీప్యాన్నీ సహించలేనేమో! ఏ మనిషికీ సన్నిహితంగా వుండలేనేమో!

మరి నాతో?

వులిక్కిపడ్డాను ఆ ప్రశ్నకు. నా విసిరా గుర్తొచ్చి తీవ్ర అసహనానికి లోనయ్యాను.

కటిక చీకటి ఆవరించుకున్నట్టయింది. ఎన్నో దీపాలు వెలిగితేగానీ నాకు వూపిరి కూడా ఆడేటట్టు లేదు.

ప్రశ్నించడం ఎంత తేలికో, ప్రశ్నను ఎదుర్కోవడం ఎంత విసుగో నరకమో నాకా క్షణం అర్థమైంది.

చాలా కోపం వచ్చింది. మనుషుల మీదైతే కాదు. అమాయకులు పాపం!

అంతవరకు చేత్తో లాగుతున్న తాడును విసురుగా భుజం మీదుగా లాగి పట్టుకున్నాను. పిడికిలికి నాలుగు చుట్లు చుట్లుకుని బిగించి నిటారుగా నిల్చున్నాను. చదునుగా దృఢంగా వున్న నా బ్రమ్మచర్యపు గుండెల్ని ఓసారి గాలితో నింపి ఉబ్బించాను. తొడల్లోకి బలాన్నంతా కూడగట్టుకుని ఆ హోరుగాలిలో బండిని ఈడ్చుకుంటూ పరిగెత్తడం ప్రారంభించాను. బండి చక్రాలు దడదడలాడుతున్నాయి భూకంపం వచ్చినట్టు. ఏదో విధ్వంసాన్ని ప్రేరేపించే వాయిద్యాల్లా నా బూట్లు శబ్దం చేస్తున్నాయి. పేవ్‌మెంటు మీద ఎదురుగా వస్తున్నవాళ్లు భయంతో రోడ్డు మీదకి దూకేస్తున్నారు. వాహనదారులు నాకేసి ఆశ్చర్యంగా తలలు తిప్పి చూస్తూ వెళుతున్నారు.

ఇంకా కరెంటు రాలేదు. వచ్చాక అందరూ నన్ను చూసి ఏమనుకుంటారనే సిగ్గూ శరం ఇంత కూడా లేదు నాలో. అంత కోపంతో కాలిపోతున్నాను.

రూంకొచ్చేసరికి రాత్రి వొంటిగంట దాటింది.



మెడ కింద చెమటతో తడిసిన దుమ్ము గరగరలాడుతోంది. అంతవరకు పాదాల్ని చెమటలో మగ్గబెట్టిన బూట్లని ఓ మూలకి విసిరేశాను. వుప్పు కట్టిపోయిన యూనిఫామ్‌ని విప్పి తాడు మీద వేశాను.

చల్లటి నీళ్లతో స్నానం చేసి చప్పగా చల్లారిన మధ్యాన్నం వొండిన అన్నం, కూర కలుపుకుని తింటూంటే వేడి వేడి టీ తాగాలనిపించింది.

చూస్తే పాలు లేవు. కిరోసిన్ స్టావ్ మీద నీళ్లగిన్నె ఎక్కించాను. చెంచా టీ పొడి అందులో వేసి గిన్నె వేపే చూస్తూ కూచున్నాను కమ్మటి టీ ఆవిర్లు మొదలైందాకా. జీవితంలో ఎప్పుడైనా తేయాకు తోటల్ని

తదేకంగా చూస్తూంటే నక్షత్రాలు నన్నూ తమలో ఒకడిగా స్వీకరించినట్టు అనిపించింది. జాగ్రత్తగా ఆ లోయలోకి దిగడం ప్రారంభించాను. ఎలా దిగానో మాత్రం గుర్తు లేదు. బహుశా అది అప్పటికప్పుడు మాత్రమే తెలిసే విద్య అది.

చూడాలి. కొండల మీద మెట్లు మెట్లుగా పెంచుతారట. ఎంతన్నా ఖర్చు కానీ టీ సజీవ పరిమళాల్ని ఆస్వాదించాలి. రూం పైకెళ్లి చాప పర్చుకుని పడుకున్నాను. మామూలుగా ఎండా కాలంలో చేసే పని. ఆ చిక్కటి చలిలో చెయ్యాలనిపించింది. తల కింద దిండును సౌకర్యంగా సర్దుకుంటూ మొహం వొదిలేసి మొత్తం రగ్గులో దూరిపోయి ఆకాశం వేపు చూశాను.

ఎన్ని నక్షత్రాలో! లోయనిండా రాలిపడినట్టున్నాయి. తదేకంగా చూస్తూంటే నక్షత్రాలు నన్నూ తమలో ఒకడిగా స్వీకరించినట్టు అనిపించింది. జాగ్రత్తగా ఆ లోయలోకి దిగడం ప్రారంభించాను. ఎలా దిగానో మాత్రం గుర్తు లేదు. బహుశా అది అప్పటికప్పుడు మాత్రమే తెలిసే విద్య అది. అడ్డదిడ్డంగా మొలిచిన నక్షత్రాల మధ్య నడుస్తున్నాను. నడుస్తూంటే ఈ ప్రాంతం కొత్తగా అనిపించడం లేదు. దారులన్నీ నాకు ముందే తెలిసిపోతున్నాయి. నక్షత్రాల్ని ముట్టుకుంటే ఎంతో మృదువుగా సంగీతంలా వున్నాయి. శబ్దాన్ని తాకిన ఆనాటి అనుభవం నాకు ఇప్పటికీ అబ్బురమే. ఎంత దూరం నడిచినా ఆ నక్షత్రాల తోట తరగడమే లేదు. గాలికి నెమ్మదిగా వూగుతున్నాయి నక్షత్రాలు. పైగా అవన్నీ ఏదో గుసగుసలాడుతున్నట్టు నా మనసుకు తెలుస్తోంది. ఏం చెబుదామని ప్రయత్నిస్తున్నాయో' మాత్రం నా మొద్దు బుర్రకు తట్టనేలేదు.



# మాయ

వాల్మీకులవారు రాముడి చరిత్ర గ్రంథస్థం చేస్తూ ఎందుచేతనో రెండు విషయాలు వదిలివేశారు. వారు వదిలివేసినా జనం వాటిని గుర్తు పెట్టుకున్నారు.

ఒకటేమిటంటే,

దండకారణ్యంలో రాముడు సంచరిస్తున్నప్పుడు అతడు అవతార పురుషుడన్న సంగతి అక్కడి ఋషివాటికల్లో మారుమోగిపోయింది. వీలున్నవాళ్ళు వెళ్ళి దర్శించుకొని వస్తున్నారు. ఓ ఋషిపుంగవుని గురుకులంలో కొందరు శిష్యులు విద్యాభ్యాసం చేస్తున్నారు. వారిలో ఓ ఐదారుగురు రాముడు మనలాగే రెండు చేతులు రెండు కాళ్ళతోనే పుట్టాడు. ఆయన దేవుడెట్లా అవుతాడని ఓ వితండ వాదం లేవనెత్తారు. గురువుగారు చెప్పి చూశారుగాని వారు తమ ఆలోచన మానుకోలేదు. రాముడు దగ్గరకే వెళ్ళి ఏ సంగతీ తేల్చుకుందాము రండని గురువుగార్ని కూడా బలవంతం చేసి తీసుకెళ్ళారు.

రాముడు వాళ్ళతో అన్నాడు, 'నా భార్య కనబడక నేను ఏడుస్తుంటే, నన్ను అవతార పురుషుడంటారేమిటి? ఆమె ఎక్కడుందో తెలియక తిరుగుతున్నాను. మీరు కూడా వెతికిపెట్టండి. మీ ఋణం వుంచుకోను', అని.

ఆ మాటతో శిష్యుల అనుమానం నివృత్తి అయింది. ఇలాంటి రాముణ్ణి గుడ్డిగా అవతార పురుషుడని నమ్మే గురువు మనకేం దారి చూపిస్తాడు అనుకొని గురువుగార్ని అక్కడే వదిలేసి వెళ్ళిపోయారు.

అలా వాళ్ళు వెళ్ళిపోయాక ఆ గురువుగారు రాముడి ముందు సాష్టాంగపడి, 'మహానుభావా, వీళ్ళని ఎట్లా వదల్చుకోవాలో తెలియక నానా తంటాలు పడుతున్నాను. మాయ చేసి క్షణంలో వీళ్ళని పంపించివేశావు గదా' అని చెప్పి మహదానందపడిపోయాడు.

రెండోది ఏమంటే,

రాముడు రాజ్యపాలన చేసేటప్పుడు రోజూ ప్రొద్దున్నే ఎనిమిది గంటలకు న్యాయపీఠం ఎక్కి కూర్చొని, పన్నెండు కొట్టే దాకా వుండేవాడు. ఆ సమయంలో ప్రజల కష్టాలు విని సాయం చేయటం, తగువులొస్తే తీర్చటం చేసేవాడు.

ఓ రోజు అప్పటికే పన్నెండు అయింది. అప్పుడు వచ్చాడు ఒకాయన లోనికి. రాములవారు లేచినవాడల్లా కూర్చొని ఏమిటి సంగతి అని అడిగాడు.

ఆ వచ్చినవాడు నీళ్ళు నములుతూ 'నా భార్యను ఎవడో ఎత్తుకువెళ్ళాడు' అని చెప్పాడు.

'అయితే నా దగ్గరకు ఎందుకు వచ్చావు?' అని అడిగాడు రాముడు. 'తమరు వెదికి పెడతారని' అని నసుగుతూ చెప్పాడు అతడు.

రాములవారికి చెడ్డ చిరాకు వేసింది.

'నా భార్యకు అదే జరిగినప్పుడు వెదికిపెట్టినాయన నా వెనుకనే వున్నాడు. ఆయన్ని పట్టుకో' అని హనుమంతుల వారిని చూపించి అక్కడ నుండి విరవిరా వెళ్ళిపోయాడు.

– దీవి సుబ్బారావు